# పెళ్ళంటే...

ఆరోజు కావ్యకి ఐదో పెళ్ళి చూపుల ఏర్పాటు అయింది. ఈ సంబంధం అయినా కుదిరేట్టు చేయి తండ్రీ అని మనసులోనే దండాలు పెట్టుకున్నారు తల్లిదండ్రులు. ఈ తిక్కది ఈసారన్నా కాస్త కుదురుగా, అణుకువగా కూర్చుని మాట్లాడేట్టు చేయి అని ప్రార్థించారు.

కావ్యకేమన్నా కాలొంకరా, చెయ్యొంకరా, పల్లెటూరి మొద్దా, చదువురాని పిల్లా, అందం లేదా, తండ్రికి అంతస్థు, ఐశ్వర్యం లేదా అంటే అన్నీ వున్నాయి. ఉండాల్సిందానికన్నా ఎక్కువే ఉన్నాయి. అదే బాధ! పెద్ద గవర్నమెంటు ఆఫీసరు తండ్రి. బంగళా, కారు, బ్యాంకు ఖాతాలు వున్న ఐశ్వర్యవంతుల ఇంట పుట్టింది. ఇంజనీరింగు చదివి, కంప్యూటర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. అందమంటారా చిదిమి దీపం పెట్టుకోవచ్చు. అణుకవంటారా, అదే.. అదే వచ్చిన చిక్కు. చదువు, అందం, అంతస్థు, హోదా, ఐశ్వర్యం అన్నీ కల్సి వినయం నేర్పే బదులు అహంకారాన్నిచ్చాయి. విద్య వినయంబు నొసగు అన్న నానుడి కావ్య విషయంలో అబద్ధమయి కూర్చుంది. తన కన్నీవున్నాయి తనెందుకు తల వంచి పెళ్ళిచూపులకి కూర్చోవాలి. ఎదురుగా కూర్చున్నవాడు ఎస్ అంటాడా, నో అంటాడా అంటూ ఆరాటపడాల్సిన ఖర్మ తనకేం లేదు.

అసలు పెళ్ళి చూపులేమిటి నాన్సెన్స్ మీరెవర్నీ వెదకనక్కరలేదు. నాకు నచ్చిన వాడు కనిపిస్తే నేను చూపిస్తాలెండి అని తల్లి దండ్రి మాట కొటిపారేసింది. ఒక ఏడాది పాటు వచ్చిన వాడెవడూ ఏడాదిలోనైనా కూతురికి కనపడలేదంటే కూతురి మీద ఈ భారం వదిలిస్తే ఇప్పటికే పాతికేళ్ళు వచ్చాయి. ఇంకా ఎన్నేళ్ళొస్తాయో అన్న భయంతో తల్లిదండ్రి బతిమాలి అబ్బాయిని తేవడం వరకే మీ ఇష్టం. తెచ్చిన వాళ్ళల్లో నచ్చిన వాడ్ని ఎంచుకునే హక్కు నీకెప్పుడూ వుంటుంది అని బుజ్జగించారు. "నేను అబ్బాయితో మాట్లాడాలి. వారి ప్లస్ మైనస్ పాయింట్లు బేరీజు వేసుకోవాలి. నా సందేహాలకి సమాధానం రాబట్టాలి. ఇద్దరి అభిప్రాయాలు కలవాలి. అంచేత నాతో గంట ప్రత్యేకంగా మాట్లాడి ప్రశ్నించే అధికారం వుందంటేనే పిలవండి' అని తెగేసి చెప్పేసింది అమ్మాయి.

'అయ్యో దానికేం, ఈ రోజుల్లో అబ్బాయి అమ్మాయి మాట్లాడుకోవడం కామనేగదా అనుకుని సంబరపడి తలలూపారు.

తరువాత రెండు మూడు సంబంధాలని పిలిచి చూపించాక అమ్మాయి మాట్లాడడం కాదు, దంచుతుంది. అక్షరాలా రోట్లో వేసి చింతకాయలు దంచినట్టు దంచి పారేస్తోందని నిలబెట్టి నీళ్ళుమొహాన కొట్టి కడిగేస్తుందని, బోనులో ముద్దాయిని క్రాస్ ఎగ్జామిన్ చేసినట్టు ఊదరగొట్టేస్తుందని, ఒకటి రెండు రెడీ అని పరుగుపందెం స్టార్ట్ చేసినట్టు వాళ్ళకి ఊపిరి పీల్చుకోవడానికి టైమివ్వకుండా ప్రశ్నలు కురిపిస్తుందన్నది అర్థమయ్యేవేళకి - మొదటి అమెరికా ఇంజనీరుకి ఇగో తన్నుకొచ్చి "నా కోసం డజనుమంది వరుసలో నిల్చున్నారు. నీ ముందు నేను నిల్చుని నీ ప్రశ్నలకి నేను జవాబిబవ్వడం ఏమిటి? గోటు హెల్' అని ఇలాంటి సంబంధం చూసుకున్నందుకు తల్లిదండ్రుల మీద ఎగిరిపడి వెళ్ళిపోయాడు. రెండో ఎలక్ట్రానిక్ ఎమ్మెస్ అబ్బాయి రెండు మూడు ప్రశ్నలకి సరదాగా జవాబిచ్చి, రాన్రాను జి.ఆర్.ఇ (అమెరికా వెళ్ళి ఇంజనీరింగ్ ఎమ్మెస్ చేద్దామనుకునే విద్యార్థులు జవాబు ఇవ్వాల్సిన కంప్యూటర్‌లో వచ్చే (ప్రశ్నావళి) పరీక్షలో ముందు తేలికైనవి యిచ్చి ఆన్సర్ కరెక్ట్‌గా ఇస్తుంటే కఠినమైన ప్రశ్నలు ఇవ్వడం ఆరంభమైనట్టు లెక్కలేనన్ని ప్రశ్నలు, చెత్త ప్రశ్నలు కురిపిస్తుంటే లీవుపెట్టి నేను పెళ్ళిచూపుల కొచ్చాను కాని జి.ఆర్.ఇ రాయటానికి రాలేదంటు కోపంగా వెళ్ళిపోయాడు. మూడో ఐ.ఏ.ఎస్ అబ్బాయికి మొదటే అమ్మాయి దూకుడు ధోరణి చూసి జిల్లా అంతటికి అధికారిని, రేపు..హైలెవల్లో సెక్రటరీ హోదాలో రాజ్యాంగాన్ని నడిపించాల్సిన తను ఓ అమ్మాయి ముందు నిలబడి ప్రశ్నలకి జవాబులివ్వడమా అని చివరి వరకు ఒక్క ప్రశ్నకీ జవాబివ్వకుండా అన్ని ప్రశ్నలు విని ఒక్క మాట కూడా మాట్లాడకుండా హుందాగా లేచి టై సవరించుకుంటూ బయటికి నడిచి వెళ్ళిపోయాడు. నాలుగో ఎకనామిక్స్ డాక్టరేట్ అబ్బాయి పాపం కాస్త బోళా మనిషి. ఈ అమ్మాయి ఇప్పుడే హిడింబిలా కనిపిస్తుంటే రేపు పెళ్ళి చేసుకుంటే ఎలా బాబూ అనుకుని ఐదు ప్రశ్నలకి జవాబులు చెప్పి చెమటలు కక్కుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు. అమ్మాయి విజయగర్వంతో నవ్వుకుంది. కాని తల్లిదండ్రులు గుండెల్లో గుర్రాలు పరిగెత్తాయి. ఇంత మంచి సంబంధాలు కూతురు ఘటోత్కచుడు ఉఫ్ అని ఊది లడ్డూలని నోట్లో పడేసుకున్నట్లు కుర్రాళ్ళని ఎగరగొట్టి పారేస్తుంటే పెళ్లెలా అని బెంగపడ్డారు.

ఐదో పెళ్ళి చూపులబ్బాయి ఎమ్మెస్ కంప్యూటర్ ఇంజనీరు అబ్బాయే. అమెరికాలో నెలకి దాదాపు ఐదు లక్షలు (రూపాయలు) సంపాదిస్తున్న పెద్ద ఉద్యోగి. ఎర్రగా బుర్రగా దొరలా సూటుబూటుతో వచ్చిన ఈ కుర్రాడు ఎంతో నచ్చిపోయి భగవంతుడా ఇంత

మంచి సంబంధం చెడగొట్టకుండా ఆ పిల్ల బుద్ధి కాస్త మారేట్టు చూడు తండ్రి అని మనసులో వెయ్యి దండాలు పెట్టుకున్నారు. 'కావ్యా ఈసారి నీవు ఈ అబ్బాయిని వెళ్ళగొట్టావంటే ఇంక నీకు మేం సంబంధాలు చూడం. తరువాత నీవే చూసుకుంటావో నీ ఇష్టం అని గట్టిగా అల్టిమేటమ్ ఇచ్చేశారు. కావ్యకి కూడా నాలుగు పెళ్ళి చూపులయ్యేసరికి కాస్త విసుగు వచ్చేసింది. పాపం ఈ కుర్రాళ్ళు తన ధాటికి ఆగలేకపోతున్నారు. చూశారా అని తన ప్రశ్నావళి ఈసారి కాస్త వెరయిటీగా ఈజీ చేద్దామనుకుంది తల్లిదండ్రుల గోల భరించలేక.

పెళ్ళివారు వచ్చారు. ఆవాహనం, అసనం, అర్ఘ్యం, నైవేద్యం తదితర మర్యాదలు పూర్తి అయ్యాక అమ్మాయి అబ్బాయిని తన గదిలోకి తీసుకెళ్ళి సుఖాసీనుడ్ని చేసింది. ఎ.సి. రూములో గదిలో కంప్యూటరు ప్రింటరు, పేర్చిన పుస్తకాలు, అమ్మాయి విజ్ఞానాన్ని వ్యక్తీకరిస్తుంటే, గదిలో అమర్చిన గోడల మీద పెయింటింగులు, అలంకరించిన ఎన్‌టిక్స్, అమ్మాయి అభిరుచుల్ని తెలియజేశాయి. అమ్మాయి అందగత్తె, అభిరుచి బాగుంది. చదువు, ఉద్యోగం సరేసరి అని ఈ మూడు క్వాలిఫికేషన్లకి మనసులో మార్కులు వేసుకున్నాడు అబ్బాయి.

కావ్యకి కూడా అబ్బాయి ఆరడుగులు పొడుగు, రంగు, రూపం, ఉద్యోగం అప్పటికే నచ్చాయి. ఫేమిలీ తల్లిదండ్రి ఉద్యోగస్థులు, సంస్కారం, హోదా నచ్చాయి. అబ్బాయి అక్క అమెరికాలో డాక్టరు. అదీ నచ్చింది. ఇంకా నచ్చాల్సినవి అభిప్రాయాలు. కావ్య గొంతు సవరించుకుంది.

"చూడండి...మిస్టర్..." కావ్య వాక్యం పూర్తి చేసే లోపలే 'వరుణ్' అన్నాడు నవ్వి. కావ్య చురుకుగా చూసింది. 'మిస్టర్ వరుణ్. మీ క్వాలిఫికేషన్స్' అని వాక్యం పూర్తి చేయకముందే 'నా బయోడేటా మా వాళ్ళివ్వడం మీరు మీ వాళ్ళు అది పూర్తిగా చదివేకే పెళ్ళి చూపులకి పిల్చి వుండాలని అనుకుంటున్నాను అన్నాడు గడుసుగా. మరోసారి కావ్య అతని వంక సూటిగా చూసింది. ఇచ్చారు. చూశాను. కాని డిటైల్స్ ఏ ఏ చదువు ఏ ఏ యూనిర్సిటీల నించి తెల్సుకోవాలి..!

'ఐసీ, మెట్రిక్ వరకు రాజమండ్రి, ఇంటర్ విశాఖపట్నం, ఇంజనీరింగ్ ఖరగ్‌పూర్, ఐఐటి, ఎమ్మెస్ వర్జీనియా టెక్ నించి చాలా" అన్నాడు నవ్వి.

'గుడ్. ఇప్పుడు మీరు చేస్తున్న కంపెనీ, ప్రస్తుత మీ జీతం..." కావ్య మాట పూర్తిచెయ్యక ముందే' ఆడదాని వయసు, మగాడి జీతం అడగకూడదంటారు గదా కొంటెగా అన్నాడు. కావ్య కాస్త దూకుడుగా 'అది పెళ్ళి సంబంధానికొచ్చిన వారికి

వర్తించదు మిస్టర్ వరుణ్. మీ జీతం తెల్సుకోకుండా ఏ అమ్మాయి మీతో జీవితం పంచుకోలేదు" అంది.

"ఐసీ. డాలర్లలో చెప్పాలా, రూపాయల్లోన" మళ్ళీ కొంటెగా అడిగాడు.

"ఎలా చెప్పినా లెక్కలు ఆ మాత్రం తెలుసు ఇంజనీరింగు చదివిన నాకు' కాస్త టెక్కుగా అంది కావ్య.

"అవును కదూ మర్చిపోయా మీరూ ఇంజనీరని, ఐతే డాలర్లలో నెలకి ఎనిమిది వేలు, రూపాయల్లో గుణించుకోండి" విలాసంగా అన్నాడు.

"గుడ్ శాలరీ. మీకీ జాబ్ గ్యారంటీ వుందా- ఐమీన్ ఈ రోజుల్లో ఐటి కంపెనీలు మాద్యంలో వున్న సందర్భంలో మీ జావ్ సేఫ్టీ ఎంత శాతం?

"ఈ జాబ్ పోతే ఇంకో జాబ్ వెంటనే సంపాదించుకోగల శక్తి సామర్థ్యాలు నాకున్నాఇ గనక ఆ విషయంలో విషయం నేనాలోచించలేదు".

"గుడ్ ఆ మాత్రం కాన్ఫిడెన్సు మంచిదే. సరే సపోజ్ మన ఇద్దరం ఒకరికొకరం నచ్చి పెళ్ళి చేసుకొంటే భార్యకి మీరిచ్చే స్థానం ఏమిటి?"

"సారీ, మీ ప్రశ్న నాకర్థం కాలేదు. భార్యకి భార్య స్థానం ఉంటుంది. దానికి ఏమిటి అన్న ప్రశ్నేమిటి?"

"ఐ మీన్ నేను మీతో సమానంగా చదువుకున్నాను. మీకంటె జూనియర్ని కనక మీకంటే కాస్త జీతం తక్కువ. ఇద్దరం చదివి, సంపాదిస్తున్నప్పుడు ఇద్దరికి సమాన హక్కులు, సమాన బాధ్యతలు సమాన గౌరవ మర్యాదలుండలని నా ఉద్దేశం"

"గౌరవం మర్యాద, హక్కులు ఒకరిస్తే రావు. తెచ్చుకోవాల్సి వుంటుందని నా ఉద్దేశం, డిమాండ్ చేస్తే వచ్చేవి కావు అని నా భావన" కావ్య వంక చూస్తూ గడుసుగా అన్నాడు. కావ్య మొహంలో రంగు మారింది. ఒక్కక్షణంలో ఆ భావం మార్చి 'అఫ్‌కోర్స్ యూ ఆర్ రైట్. కాని ఈనాటికీ అమ్మాయిలు అబ్బాయిలతో సరిసమానంగా చదివి, ఉద్యోగం చేస్తున్న ఆడదనగానే పెళ్ళాం కాగానే భార్య ఎప్పుడూ కింద మెట్టు మీదే వుండాలి. ఇంట్లో ఎప్పుడూ భర్తదే పెత్తనం, భార్య ఎంత సంపాదిస్తున్నా ఇంటి చాకిరి భార్యదే అనుకునే భర్తలున్న మన సమాజంలో ఆ భావనకి నేనంగీకరించను. భార్యకి ఆ ఇంట్లో సర్వ హక్కులు స్వాతంత్రం వుండాలి. ఫర్ ఎగ్జాంపుల్ నేను ఉద్యోగస్థురాలిని గనక రాకపోకలు టైమింగ్స్‌లో తేడాలుంటాయి. ఒక రోజు ఆలస్యం అవచ్చు. ఒకరోజు పెందలాడే వెళ్ళాల్సి రావచ్చు. అలాంటపుడు భర్త ఇంటి పనులు చూసుకోవాల్సి వుంటుంది. ఫలానా పని ఆడదే చెయ్యాలి. ఫలానా పని మగాడిది అన్న

నిబంధనలుండరాదు. నా రాకపోకలని నిలదీసే హక్కు మీకుండదు. ఎందుకు; ఏమిటి ఎక్కడికెళ్ళావు ఇంత సేపేం చేశావు లాంటి ప్రశ్నలు వేయరాదు. నా వ్యక్తిగత అభిరుచులకి అడ్డుతగలరాదు".

"వ్యక్తిగత అభిరుచులు - అడ్డు - అంటే"

"నా డ్రెస్సింగ్, నాకేశ భూషణాలు నా యిష్టం ఇల్లు అలంకరణ నా యిష్టం"

"వీటన్నింటి గురించి పట్టించుకునే తీరిక మాకుండదు. లెండి- ఇవి నా దృష్టిలో చాలా చిన్న విషయాలు-అసభ్యకరంగా, అభ్యంతరకరంగా తనంతవరకూ ఫర్వాలేదు అని చేర్చాడు.

"ఓకే గుడ్. చూడండి ఇద్దరం సంపాయిస్తున్నాం కనక ఇంటిఖర్చు ఇద్దరి సమంగా ఖర్చుపెట్టాలని మీ ఉద్దేశమా. లేక నా డబ్బు నేను నా యిష్టం వచ్చిన రీతిన ఖర్చుపెట్టి ఇష్టం వచ్చిన రీతిలో ఇన్వెస్ట్ చేయచ్చా" సవాల్ విసిరింది.

వరుణ్ సూటిగా కావ్య కళ్ళలోకి చూశాడు. "మామూలుగా అయితే ఇంటి ఖర్చులు అన్నీ నేనే పెట్టినా మిగిలే సంపాదన నాకుంది. కాని మీరు సమాన హక్కులు కోరుతున్నాడు గనక సమాన బాధ్యతలు పంచుకోవాలి అని నా ఉద్దేశం"

"వెల్ సెడ్, సమాన ఖర్చులు, బాధ్యతలు తీసుకుంటున్నాం గనక సమానంగా పనులు కూడా పంచుకోవాలి. మనం ఏ ఏ పనులు ఎవరు చెయ్యాలి? ఏ పని మీది ఏ పని నాది అని ముందే నిర్ణయించుకోవాలి. ఆ విధంగా టైంటేబుల్ వేసుకుంటే గొడవలుండవని నా ఉద్దేశం. అంతే ప్లాన్డ్‌గా నిర్ణయించుకుంటే అపోహలు రావు...ఇంతకీ మీకు వంట వచ్చా- ఎట్ లీస్ట్ మేనేజ్ చేసేయగలరా"

"ఇంతకీ మీకు వంట వచ్చా ముందది చెప్పండి. మేడమ్ చూడండి. అమెరికా వెళ్ళాక అబ్బాయేనా, అమ్మాయేనా వంట చేసుకోడం..అంటే పంచభక్ష్యాలు కాకపోయినా...అన్నం చారు, సాంబారు, వేపుళ్ళు లాంటి సింపుల్ వంట ప్రతివారు నేర్చుకుంటారు. ఎందుకంటే అక్కడి తిండి తినలేం గనక ఖర్చు భరించలేం కనక. సో మీ ప్రశ్న అర్థం లేనిది. ఇండియాలో వున్న మీ లాంటి అమ్మాయిలకే రాదు. ఇంతకీ మీకు వచ్చా..."

కావ్య కాస్త గాభరాపడింది. "రాదనుకోండి. వెళ్ళేలోగా నేర్చుకోవాలి. అమ్మ అంటుంది. కాస్త అన్నం అది అయినా వండడం రాకపోతే ఎలా అని..." గొణిగింది.

"అంటే. మీకు రాకుండా ఎదుటి వారిని అడగాల్సిన ప్రశ్న కాదు. వంట, తిండి అన్నం మాకు అక్కడ చాలా చిన్న విషయాలు. అన్ని పాకెట్లలో దొరుకుతాయి.

పళ్లరసాలు, పాలు, బ్రెడ్‌లు, రొట్టెలు, ఏదయినా తినేసి సర్దుకుపోతాం. తినాలనిపించినపుడు మన వంటవండుకుంటాం. ఇదీ పెద్ద ఇష్యు గాదు" తేలిగ్గా కొట్టిపారేసి ఇటువంటి విషయాలు వదిలేసి ఇంకేం అడగదల్చుకున్నారో అడగండి" కావ్య కాస్త తడబడి మొహం ఎర్రబర్చుకుంది.

కాస్త మాటలు తడుముకుంటూ 'నా వ్యక్తిత్వం, నా ఆత్మ గౌరవం నా అభిమానం దెబ్బతినకుండా నడుచుకోవాలి. నన్ను చేసుకునేవాడు...'

"అంటే ఒక్క మాటలో మీరేం చేసినా, చేస్తున్నా ఏమనకూడదనా మీ ఉద్దేశం?"

'అదికాదు. పాత కాలం మొగుళ్ళులా నా మీద అధికారం, దర్పం ప్రదర్శించి నన్ను కట్టుబాట్లలో పెట్టి నన్ను లొంగదీసుకుని అణగదొక్కాలని ప్రయత్నించకూడదు. ఓ భార్యనించి మీరేం ఆశిస్తారో అదే విధంగా తన పట్ల ప్రవర్తించాలని ఈ నాటి భార్యలు కోరుకుంటారు.

"చూడండి కావ్యగారూ, ముందే చెప్పాను. మర్యాద, గౌరవం అభిమానం అడిగితే ఇచ్చేవి కావు. అవి మీరు కావాలనుకుంటే దాని కనుగుణంగా మీ ప్రవర్తన వుంటే వాటంతట అవే వస్తాయి. ఇంతకీ మీరు నిలేసి అడిగినప్పుడు 'సరే' అని వప్పుకుని తరువాత కట్టుకున్న వాడు మీరడిగినవేవి పాటించకపోతే ఏం చేస్తారుట?" హేళనంగా అన్నాడు. కావ్య మొహం ఎర్రబడింది. ఆవేశంగా తలవిదిల్చి 'అలా ప్రవర్తిస్తే డైవర్సు వుండనే వుంది. అభిప్రాయాలు కలవని, గౌరవించని భర్తలతో సర్దుకుని పడి ఉండాల్సిన గతి ఈనాటి అమ్మాయిలకి లేదు అని తెలియజేస్తున్నాను" పొగరుగా అంది.

"అంటే ఇంకా మీరు పెళ్ళికాకుండానే విడాకుల గురించి ఆలోచిస్తున్నారన్న మాట"

"వైనాట్ కీడెంచి మేలెంచాలి గదా, అన్ని కోణాల నుంచి ఆలోచించాలి గదా! ఇంతకీ మీరు మీ సంగతి చెప్పండి. నే మాట్లాడిన విషయాల గురించి మీ అభిప్రాయం ఏమిటి? నా భావాలతో ఏకీభవిస్తారా? స్త్రీ, భార్య, అంటే సమానంగ గౌరవం పంచి యిచ్చి ఆమె వ్యకిత్వాన్ని గౌరవిస్తారా? ఆమెకు మీతో సమంగా హక్కులు ఇవ్వడంలో అభ్యంతరం వుందా? నా చదువు, రూపం, ఉద్యోగం, జీతం, నా భావాలు, వ్యక్తిత్వం గురించి ఈ అభిప్రాయాలని వినాలనుకుంటున్నాను" దర్పంగా అడిగింది కావ్య...... ఆమె వంక పట్టి చూశాడు వరుణ్. ఒక నిమిషం మౌనంగా ఉన్నాడు.

'మీకు మీ గురించి జవాబిచ్చే ముందు ఒక మాట స్పష్టం చెయ్యాలను కుంటున్నాను. నేను మధ్య తరగతిలో పెరిగాను. నాన్న ఉద్యోగం చేస్తే తెచ్చిన దానితో

పొదుపుగా సంసారం చేసే మంచి మనసున్న అమ్మలో నుంచి గృహిణిని, కట్టుకున్న భార్య పట్ల బాధ్యతతో ప్రవర్తించిన నాన్నగారిలో మంచి గృహస్థుని చూశాను. పిల్లలకి ముగ్గురికి మంచి చదువులు చెప్పించడమే తామీయగ్గిన ఆస్థులని నమ్మే మధ్యతరగతి సంసారం మాది, అన్న అక్క నేను పిల్లలుగా తల్లిదండ్రుల పట్ల భయభక్తులతో మాలో మేం ఆప్యాయతలు, అనుబంధాలతో చెప్పించిన విద్య అవకాశాలని అందిపుచ్చుకుని బాధ్యతాయుతంగా చదువుకుని పైకి వచ్చిన మంచి పిల్లలమనిపించుకున్నాం. అమ్మా నాన్న, అప్పచెల్లెళ్లు, అన్నదమ్ములు, బంధువులు ఆప్యాయతలు, అనురాగాలు పంచుకున్నాం గాని మా హక్కుల గురించి మేం ఎన్నడూ ఆలోచించలేదు. మా అక్క డాక్టరు చదివి కూడా మామూలు గృహిణిలాగే ఇల్లు, సంసారం, పిల్లలు మధ్య తన ఉద్యోగ బాధ్యతలూ నిర్వహించే మామూలు గృహిణినే తనూ అనుకుంటుంది. మేమూ అనుకుంటాం. మా అన్నయ్య భార్య, అదే మా వదిన అలాగే మాతో కల్సిపోయింది, ఉద్యోగస్థురాలైనా అలాగే రేపు కాబోయే నా భార్య మాలో ఒకరిగా కల్సిపోవాలనుకునే మనస్తత్వాలున్న మధ్య తరగతి మనుష్యులం మేం. ఈ రోజు మీలాంటి అమ్మాయి అడిగే ఈ ప్రశ్నలు..సందిగ్ధంగా ఆగాడు...

"తప్పని అనలేను. కానీ, భవిష్యత్తుని మాటల భరోసాతో నిర్ణయించుకోవాలనుకోవాలనుకోడంలో సబబు ఎంత అని అనుమానం. సరే, నా మాటలవల్ల మీరీ గంటలో ఏం తెల్సుకున్నారు? ఎంత తెల్సుకున్నారు చెప్పండి" ముందు రెట్టించి అడిగాడు.

"మీ చదువు, ఉద్యోగం, ఫేమిలీ, రూపం వీటన్నింటికి పదికి పది మార్కులు ఇచ్చాను. మీతో మాట్లాడిన అరగంటలో మీకూ కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయని స్వంత ఆలోచనలున్నాయని, అవి ధైర్యంగా చెప్పగలిగే శక్తి వుందని, మీ మనసులో మాట నిర్భయంగా చెప్పగలిగిన వ్యక్తిత్వం ఉన్నాయని గమనించాను. ఐ అప్రీషియేట్ యువర్ క్వాలిటీస్... ఇప్పటివరకు చూసిన వారిలో మీకే ఫస్టు మార్కు... టూ టెల్ యూ ఫ్రాంక్‌లీ మీరు నా పరీక్షలో నెగ్గారు. "అతని మొహంలోకి చూస్తూ 'పాస్ చేశానని గర్వంగా అంది కళ్ళెగెరేస్తి. వరుణ్ కావ్య మొహంలోకి ఒక్కక్షణం తదేకంగా చూసి 'సారీ, మీరు నాకు నచ్చలేదు. సారీ టూ టెల్ యూ దిస్' అన్నాడు. కావ్య నిర్ఘాంతపోయి చూసింది. మరుక్షణం ఆమె మొహం నల్లబడింది. కావ్యగారూ, మీ రూపం, చదువు, ఉద్యోగం, అంతస్థు నన్నింటికీ నేనూ పాస్ మార్కులు ఇచ్చాను. కాని చూడండి. మగాడు ముందు ఆడదాని రూపానికే ప్రాధాన్యం ఇవ్వచ్చు-కాని భార్య అయ్యాక ఆమెలో కోరుకునేది అణకువ, అనురాగం పంచి యిచ్చే గుణాన్ని ఇష్టపడతాడు. ఏం అణకువ

ఆడదానికే వుండాలా అని మీలాంటి ఆధునిక యువతులు అడగవచ్చు. నిజమే భార్య సహించాలని భర్త అనుకోడం ఈనాడు దురాశ కిందకే వస్తుంది. ఈతరం అమ్మాయిలు అది సహించరని నాకూ తెలుసు. నాఉద్దేశంలో భార్య భర్త అంటే ఇలా కండిషన్లు ముందే పెట్టుకుని, కాంట్రాక్టులు పేపరు మీద రాసుకునే బంధం కాదు. భార్య కష్టపడ్తుంటే అయ్యో ఆమె ఒక్కర్తే చేసుకుంటోంది. నేను సాయం చేయాలి అన్న భావం భర్తకి కలగాలి సహజంగా. అలాగే నా భర్తకిదిష్టం అదిష్టం అని గ్రహించి కష్టమైనా టైము సమకూర్చుకుని భర్తకి చేసిపెట్టే భార్య కావాలి, కానీ కాఫీ నువ్వు ఫలహారం నేను, డిష్ వాషింగ్ నువ్వు, వాషింగ్ మెషీను నేను అంటు వంతులు వేసుకుని మెకానికల్‌గా చేసే పనులు కాదు - ఒకరి కోసం, ఒకరు స్పందించాలి. ఆరాటపడాలి, తపించాలి. ఒకరి బాధ ఇంకొకరి వ్యధ అవాలి. ఒకరి సంతోషం ఇద్దరిది అవాలి. అదే నిజమైన అనుబంధం. నీ డబ్బు నా డబ్బు అని కాక మన డబ్బు అని ఇద్దరు కల్సి రాబడి, ఖర్చులు ప్లానింగ్ చేసుకోవాలి. నీనాలస్యంగా వచ్చినా అడగకుండా ఇంట్లో మరో మనిషి ఎలా వుంటుంది! భార్య కావచ్చు. భర్త కావచ్చు. తల్లి దండ్రి, అన్న చెల్లి ఇలా ఎవరన్నా సరే ఇంట్లో వాళ్లు సమయానికి రాకపోతే ఆరాటపడ్తారు. రాగానే నిలేస్తారు. అది తప్పు ఎలా అవుతుంది? మన వాళ్లు అనుకోబట్టే ఆరాటపడడం సహజం- ఆ ఆరాటం ఒకరి పట్ల ఒకరికి లేకపోతే ఆ బంధానికే అర్థం లేదు. పెళ్ళి అంటే ఒకరికి ఒకరు కాకపోతే ఆ బంధానికే అర్థం లేదు. పెళ్ళి అంటే రెండు హృదయాల కలయిక కావాలి కాని ఇద్దరు వ్యక్తుల కలయిక కాదు. నా భార్య ఎంత చదివినా ఎంత పెద్ద ఉద్యోగం చేసినా నేనింటికి రాగానే ఆమె కళ్లలో వెలుగు కనపడాలి. సేద తీర్చడానికి కాఫీ కప్పు అందించాలి. అలాగే ఆమె కంటె ముందు నేనింటికి వస్తే నేనా పని హృదయపూర్వకంగా చేయాలిగాని, శారీరకంగా కంటె మానసికంగా ఇద్దరూ దగ్గర కావాలంటే తమని తాము పూర్తిగా రెండో వారికి సరెండర్ చేసుకోవాలి. ఇగోలు క్లాష్ అవకూడదు. కొంత పోగొట్టుకుని కొంత పొందేది వివాహం అంటే-ప్రతి దశలో సర్దుబాటు రెండు వైపులా తప్పనిసరి. వైవాహిక బంధంలో నీవు తప్పు చేస్తే అడిగే హక్కు నాకుండాలి. నేను చేస్తే నీవు చెప్పగలగాలి. అంతే కాని వ్యక్తిత్వం, స్వేచ్ఛ, సమానత్వం పేరిట ఎవరి బరిలో వారు గిరిగీసుకుని కూర్చుంటే అది అనుబంధం కాక అగ్రిమెంటు అవుతుంది. ఈమె నాది, ఇతను నావాడు, ఈ ఇల్లు నాది, ఈ పిల్లలు నావాళ్లు అన్న సెంటిమెంటు బంధాలని గట్టిపరుస్తుంది. నీపాటికి నీకు ఇష్టం వచ్చినపుడు వస్తా, పోతా, నన్నేం అనడానికి లేదు అంటే అది హోటలు అవుతుంది కాని ఇల్లు కాదు.నేను అమెరికాలో ఉద్యోగం చేస్తున్నా నేను పుట్టిపెరిగిన ఈ దేశంలో వివాహ బంధాన్ని కుటుంబ జీవితాన్ని

ప్రేమిస్తాను. అసలు నిజం చెప్పాలంటే అమెరికా వెళ్లిన ఈ ఐదేళ్లలోనే భారతీయ వైవాహిక జీవితం, కటుంబ వ్యవస్థలో గొప్పతనం అర్థం అయింది. ఊ, అంటే విడిపోయి ఆర్నెల్లకే పెళ్లి, ఏడాదికి డైవోర్సా, ఎవరికి చెందక నలిగే పిల్లలు అక్కడి వ్యవస్థ కన్నా మన వైవాహిక వ్యవస్థ ఎంత గొప్పదో అర్థం అయింది. నేను చదువుకున్న పాత కాలం వాడినని మీరనుకున్నా ఫర్వాలేదు. నా భార్య నన్ను ప్రేమించాలి, లాలించాలి, నాకు ఏం కావాలో చూసుకోవాలి అనుకునే సగటు మగాడ్ని-ఎటొచ్చీ పాతకాలం మగాడిలా అధికార దర్పం ప్రదర్శించి పాదదాసీగా కాక హృదయురాణిగా చేసుకుని నాకు చేతనయినంతగా ఆమెని లాలించి సుఖపెట్టాలన్నది నా భావన. మీ మాటలు విన్నాక మనిద్దరి ఆలోచనల మధ్య చాలా తేడా వుంది. నాకు కావాల్సిన అనుభూతులు మీ దగ్గర లభించక పోవచ్చనిపించింది. నేను మీ రూపానికి ప్రాముఖ్యత ఇచ్చి జీవితం రిస్క్ తీసుకోలేను. నాకు అందం కంటె ఆదరణనిచ్చే భార్య కావాలి. నాకు కాంట్రాక్ట్ మేరేజ్ కాదు, మనసులు ఇచ్చి పుచ్చుకునే వివాహం కావాలి. అంచేత మీరు నచ్చినా మీ అభిప్రాయాలు నచ్చలేదు. గుడ్‌బై అండ్ గుడ్‌లక్" అని లేచి వెళ్ళిపోయిన అతని వంక వెర్రిమొహం వేసుకు చూస్తూ కూర్చుండిపోయింది కావ్య. మరో ఆరు నెలల తరువాత వచ్చిన ఆరో సంబంధాన్ని కావ్య బేషరతుగా అంగీకరించి పెళ్ళి చేసుకుంది అని వినికిడి.

◆ 'జయం' వారపత్రిక 30 అక్టోబర్-2002